

# ది కప్లెట్

కల్పనా రెంటాల

రా రా స్వామి రా రా... యదువంశ సుధాంబుధి చంద్ర...
పాట మంద్రంగా వినిపిస్తోంది. అప్పుడే బయటనుంచి వస్తున్న మాయకు లోపల ఏం జరుగుతోందో తెలుసు కాబట్టి నెమ్మదిగా శబ్దం చేయకుండా తలుపు తెరిచి అక్కడే చూస్తూ నిలబడిపోయింది.

వైష్ణవి డాన్స్ ప్రాక్టీస్ చేస్తోంది. ఆమె తనలోతాను లీనమైపోయి నృత్యం చేస్తోందన్న సంగతిని అర్థం చేసుకుంది మాయ. చిన్నపాటి అలికిడి కూడా చేయకుండా తాను నిల్చున్నచోటనే ఉండి తదేకంగా వైష్ణవిని చూడ సాగింది.

పదేళ్లుగా క్రమబద్ధంగా నృత్యం సాధన చేయటం వల్ల వైష్ణవి శరీరం చక్కటి అంగసౌష్టవంతో ఉంది. వైష్ణవిది ఛామనఛాయ. ఆమె ధరించిన తెల్లటి సల్వార్ కమీజ్ ఆమె ఒంటికి పట్టిన చెమటతో తడిసి ముద్దైపోయి మరింత శరీరాన్ని అంటిపెట్టుకుపోయింది. ఒక్కో భంగిమలో ఆమె వక్షోజాలు ఎగిరెగిరి పడుతున్నాయి సముద్రంలోని అలల్లాగా. వైష్ణవి ఏ పాటకు నృత్యం చేస్తోందో ఆ పాటకు అర్థం ఏమిటో మాయకు తెలియదు. కానీ వైష్ణవి ముద్రలు, భంగిమలు, కళ్లతో పలికిస్తున్న భావాలు అన్నీ మాయకు ఏదో అర్థమవుతున్నట్లే అనిపిస్తోంది. ఆమె హావభావాలు చూస్తున్నకొద్దీ మాయలో ఏదో అలజడి.

పాట ఆగిపోగానే వైష్ణవి ఐపాడ్ దగ్గరకెళ్లి మరుసటి పాట ప్లే కాకుండా పాజ్ చేసి మాయవైపు తిరిగి సన్నగా చిరునవ్వు నవ్వింది. కౌచ్ మీద కూర్చొని టవల్ తీసుకొని ఒంటి మీదున్న చెమటను తుడుచుకుంటోంది. నృత్యం ఆపేసినా ఇంకా ఆమెకు ఆ రొప్పు తగ్గలేదు.

"హాయ్ బేబీ," అంటూ వైష్ణవి పెదాల మీద చిన్నగా ముద్దాడి, "ఏమైనా తాగుతావా?" కిచెన్‌లోకి వెళ్లింది మాయ.

రిఫ్రిజిరేటర్ తెరిచి అందులో నుంచి ఆరెంజ్ జ్యూస్ రెండు గ్లాసుల్లో పోసి ఒకటి వైష్ణవి చేతికి ఇచ్చి మరొకటి కాఫీ టేబుల్ మీద పెట్టి వైషుని మళ్లీ గట్టిగా దగ్గరకు లాక్కుంది. "ఎంత బాగా చేస్తావో ఆ డాన్స్. డాన్స్ చేయటానికే పుట్టినట్లు ఉంటావు."

మాయ పొగడ్తకు నవ్వేసింది వైషు. "వొళ్లంతా చెమట. స్నానం చేసి వస్తానే."

"నా బేబీకి నేను స్నానం చేయించనా?" మాయ మాటల్లో ఓ కవ్వింపు .

సిగ్గుగా నవ్వుతూ, "రిలాక్స్ అవ్వు. చిటికెలో వచ్చేస్తాను," వైషు షవర్‌లోకి వెళ్లింది.

**2**

'బుక్ ఉమన్' ఒక చిన్న కమ్యూనిటీ ఫెమినిస్ట్ బుక్ స్టోర్. సమ్మర్ రీడింగ్ సిరీస్‌లో భాగంగా టెక్సాస్ ఉమన్ రైటర్ ఒకామె తన కొత్త బుక్ గురించి అక్కడ మాట్లాడుతున్న మీటింగ్‌లో మొదటిసారి మాయ, వైషు కలుసుకున్నారు.

వైష్ణవి కూచిపూడి నృత్యానికి, ప్రపంచంలోని ఇతర నృత్యరీతులకు వున్న పోలికలు, వైరుధ్యాల గురించి రీసెర్చ్ చేయాలనే ఉద్దేశ్యంతో అండర్ గ్రాడ్యు

యేషన్ లో అందుకు సంబంధించిన కోర్సులు చేస్తోంది. వైష్ణవికి 13 ఏళ్లప్పుడు గ్రీన్‌కార్డ్ మీద వైష్ణవి కుటుంబం అమెరికాకు వలస వచ్చింది. వైష్ణవికి చిన్నప్పటి నుంచి నృత్యం అంటే ప్రాణం. ఎంత ఇష్టం అంటే నిద్రపోతు న్నప్పుడు కూడా నృత్యం చేస్తున్నట్లు కాళ్లు కదుపుతూ ఉండేది. దాన్ని చూసే ఆమె తల్లితండ్రులు ఆమెకు నృత్యం నేర్పించారు. అమెరికా వచ్చేసినాసరే, వైష్ణవి నృత్యసాధన కొనసాగించింది. డా. వెంపటి చినసత్యం గారి శిష్యురాలు రాధికారెడ్డి దగ్గర వైష్ణవి ప్రైవేట్‌గా నృత్యాన్ని అభ్యసిస్తోంది. డార్మ్‌లో ఉంటే నృత్య సాధనకు వీలుకాదని వైష్ణవి తల్లితండ్రులు కొంచెం డబ్బు ఖర్చు అయినాసరే విడిగా ఇల్లు తీసుకోమన్నారు. చిన్నప్పటి నుంచి అనేక ఆంక్షల మధ్య పెరిగిన వైష్ణవి హైస్కూల్లోకి వచ్చేసరికి ధైర్యంగా తానేది అనుకుంటే అదే చెయ్యటం మొదలుపెట్టింది. ఇండియన్ కమ్యూనిటీలో నిత్యం టీనేజీ పిల్లల గురించి రకరకాల కథలు విని వైష్ణవిని మరింత కట్టడి చేయాలని తల్లితండ్రులు ప్రయత్నించి, వైష్ణవి తీవ్రంగా ఎదురుతిరగటంతో ఏం చేయాలో తెలియక ఇక కొన్ని విషయాల్లో వైష్ణవి నిర్ణయాలను అంగీకరించారు. తల్లితండ్రులు డాలస్‌లో ఉండటంతో, ఆస్టిన్‌లో ఇల్లు తీసుకున్నాక వైష్ణవికి జీవితంలో మొదటిసారి స్వేచ్ఛ, అందులోని ఆనందం తెలిసింది.

మాయ మెక్సికన్ అమెరికన్ అమ్మాయి. అమెరికాలో పుట్టి పెరిగిన మాయ చిన్నప్పటి నుంచి చదువులోనే కాకుండా స్పోర్ట్స్‌లో కూడా బాగా చురుకుగా ఉండేది. మాయ తల్లితండ్రులిద్దరూ చిత్రకారులు. ఇద్దరూ ఆర్టిస్ట్‌లు కావటంతో మాయని స్వేచ్ఛగా తనదైన వ్యక్తిత్వంతో ఉండేలా పెంచారు. మాయకు మిడిల్ స్కూల్లోనే తన సెక్సువాలిటీ పట్ల కొంత అవగాహన వుంది. మగపిల్లల కంటే ఆడపిల్లలంటేనే ఇష్టంగా వుండేది కానీ ఆ విషయాన్ని ఎవరితోనూ షేర్ చేసుకోలేదు. హైస్కూల్లోకి వచ్చాక ఫుట్‌బాల్ టీమ్‌లో ఉన్న అబ్బాయిలతో డేటింగ్ చేసింది కానీ ఏనాడూ దాన్ని ఎంజాయ్ చేయలేకపోయింది. "Woman's Body-Feminism-Sculpture" ప్రధానాంశంగా శిల్పకళ మీద పరిశోధన చేయాలని మాయ ఆకాంక్ష. శిల్పాలు చెక్కటానికి అనువైన వాతావరణం, విశాలమైన స్థలం, ఓ ప్రశాంత ఏకాగ్రత ఉండాలంటే డార్మ్‌లో కంటే విడిగా ఇంట్లో ఉండటమే మంచిదనుకుంది మాయ.

షార్ట్ హెయిర్ కట్, టీ షర్ట్, షార్ట్స్‌తో 'టాంబాయి' లుక్‌తో ఉన్న మాయ మొదటి పరిచయంలోనే వైష్ణవికి ఆసక్తికరంగా అనిపించింది. ముక్కుసూటిగా మాట్లాడే మాయ తత్త్వం నచ్చింది. మాయ మాట్లాడుతున్న విషయాలు, ఒంటి మీద పచ్చబొట్లు చూసి ఫెమినిస్ట్ అని ఊహించింది. మాయ కూడా యూటీలో అండర్ గ్రాడ్‌లో చేరుతోందని, విడిగా ఇల్లు తీసుకోవాలనుకుంటోందని తెలిసి ఆసక్తి కనబరిచింది.

జీన్స్, ఇండియన్ టాప్, లాంగ్ హెయిర్‌తో వున్న వైష్ణవి ఇండియన్ డాన్సర్ అని తెలియగానే బోలెడు ఎక్సైట్‌మెంట్‌ని చూపించింది మాయ. మీటింగ్ కాగానే ఇద్దరూ పక్కనే ఉన్న థాయ్ రెస్టారెంట్‌లో డిన్నర్ చేస్తూ ఇద్దరూ కూడా రూమ్‌మేట్స్ కోసం వెతుకుతున్నట్లు తెలుసుకున్నారు.

బొట్టు పెడితే అచ్చు నువ్వు ఇండియన్ లాగానే ఉంటావు అన్నది వైష్ణవి.

నువ్వు షార్ట్స్ వేసుకున్నప్పుడు పొడవు జుట్టుని ఇలా వదిలెయ్యకుండా వేరే హెయిర్ స్టైయిల్ చేసుకో, ఇంకా బావుంటుందని సూచించింది మాయ.

మ్యూజిక్, ఆర్ట్, బుక్స్, సినిమాలు, హెయిర్ కట్‌లు, మేకప్‌లు, ట్రెండీ డ్రెస్సుల గురించి మాట్లాడుకున్నారు. బాయ్‌ఫ్రెండ్‌ల ప్రవర్తన గురించి ఇద్దరూ జోకులు వేసుకున్నారు. ఇద్దరికీ అవతలి వాళ్లతో ఇల్లు షేర్ చేసుకోవటానికి ఎలాంటి అభ్యంతరం కనిపించకపోవటంతో కలిసి ఇళ్లు వెతుక్కున్నారు. చుట్టూ పీకాన్ చెట్లు, విశాలమైన హాలు, ఇంటి ముందు, వెనుక బోలెడంత స్థలం ఉన్న ఆ ఇల్లు కాంపస్‌కి దగ్గరగా ఉండటంతో ఇద్దరికీ బాగా నచ్చింది. ఇంట్లోవాళ్లకు ఒక మాట చెప్పి వైష్ణవి లీజ్ పేపర్ల మీద సంతకం చేసింది. ఆడపిల్లతోనే కాబట్టి కలిసి ఉండేది పెద్దగా భయపడాల్సింది లేదనుకున్నారు వైషు తల్లితండ్రులు. అటు మాయ పేరెంట్స్, ఇటు వైష్ణవి పేరెంట్స్ ఇద్దరూ కూడా వచ్చి ఆ ఇంటిని చూసి మంచి సెలెక్షన్ అని మెచ్చుకున్నారు.

## 3

ఆకాశం అంచు మీద కారుమబ్బులు అటూ ఇటూ నడుస్తున్నాయి. వైషు, మాయ ఇద్దరూ కలిసి బయటకు వచ్చారు కాసేపు అలా సాయంత్రం పూట వాకింగ్ చేయటానికి.

తలెత్తి ఆకాశం వంక చూసి, ''అబ్బ, ఎంత బాగుందో వెదర్. రోజూ ఇలా ఉంటే బావుంటుంది కదా.''

''రోజూ ఇలా ఉంటే ఈ ఎక్సైట్మెంట్ ఉండదు కానీ, కాక్టస్ కెఫేకి వెళ్దామా?'' మాయ అడిగినదానికి-

"మళ్లీ క్యాంపస్‌కా? రోజంతా అక్కడుండి మళ్లీ అక్కడికే వెళ్లాలంటే బోర్ కానీ, మొజార్ట్స్‌కి వెళ్దాం. నాకు చచ్చేంత క్లాస్ రీడింగ్ ఉంది," వైష్ణవి చెప్పినదానికి ఒప్పుకుంది మాయ.

ఇద్దరూ కాసేపు వాకింగ్ చేసి లేక్ ఆస్టిన్ మీదున్న మొజార్ట్స్ కాఫీషాప్‌లోకి వెళ్లారు.

డెక్ మీదున్న ఆ కాఫీషాపు వాళ్లకిష్టమైన ప్లేసుల్లో ఒకటి.

వాళ్లిద్దరూ అక్కడకు వెళ్లేసరికి ఆకాశం ఇంకా మబ్బుల ప్రేయసిని ముద్దాడు తూనే ఉంది.

వైషు 'పంప్కిన్ స్పైసీ కాఫీ లాటే' ఆర్డర్ చేసింది. అప్పుడు టైం చూస్తే సాయంత్రం ఆరున్నర దాటింది. "సారీ, చెప్పటం మర్చిపోయాను. ఓన్లీ డీ కాఫ్ ప్లీజ్," అంది బారిస్తాతో.

"నీకు రాత్రి నిద్ర పట్టకపోవటమే మంచిది. అయినా నిన్ను ఎలా నిద్రపుచ్చాలో, ఎలా మేల్కొల పాలో నాకు తెలుసుగా," కొంటెగా నవ్వుతూ వైషును దగ్గరకు లాక్కుంది మాయ.

ఒక్కసారిగా మాయను పక్కకు తోసేసింది. తమను ఎవరైనా చూశారేమో, ఆ మాటలు పక్కనెవరైనా విన్నారేమోనని అటూ ఇటూ ఆందోళనగా చూసింది వైషు.

వైషు తనను తోసెయ్యటం, ఆ మొహంలో ఆందోళన, కంగారు చూసేసరికి మాయ మొహం పాలి పోయింది. "నాతో బయటకు రావటం ఇష్టం లేకపోతే ఆ విషయం నేరుగా చెప్పు," విసురుగా డెక్ మీదకు వెళ్లి ఖాళీగా ఉన్న టేబుల్ ముందు కూర్చొంది మాయ. సాయం సంధ్యలోకి జారిపోతున్న సూర్యుడి కిరణాల వెలుగులో లేక్ మరింత అందంతో మెరిసిపోతోంది. కానీ మాయ కళ్లు ఆ అందాన్ని చూసే స్థితిలో లేవు. లోపల నుంచి బాధ తన్నుకు వస్తుంటే కింది పెదవిని దానికి అడ్డం వేసి ఆపుతున్నట్లు కొరుకుతూ కూర్చుంది మాయ. ఊపిరందక గిలగిలలాడిపోతున్న ఫీలింగ్. గుండెల మీద బరువుగా ఏదో పెద్ద బండరాయి. లోపల అనేక ఆలో చనలు, బాధ, దుఃఖం అన్నీ కలగలిసి మాయను లోపల నుంచి సన్నటి రంపంతో కోసేస్తున్నాయి. వైషుని ప్రేమించి తప్పుచేశానా? ఈ రిలేషన్‌షిప్ పట్ల అసలు వైషుకు గౌరవం లేదు, కొద్దిపాటి ధైర్యం కూడా చేయటం లేదు అనుకోగానే మాయకు కోపంతో పాటు బాధ కలిగింది. వైషు పట్ల ఇష్టాన్ని, ప్రేమను కేవలం నాలుగు గోడల మధ్య మాత్రమే చూపిస్తూ బయట తానెవరో పరాయి వ్యక్తిలాగా దూరం దూరంగా తిరగటం తనవల్ల కావటం లేదు. కానీ వైషుకి తన బాధ, తన ప్రేమ ఎందు కర్థం కావటం లేదు? వైషు మొదట్లో భయపడితే ధైర్యం చెప్పింది. ఆలోచించుకుంటాను, టైం కావాలంటే ఎదురుచూస్తానని ఒప్పుకుంది. కానీ రోజులు గడుస్తున్నా అరంగుళం కూడా ముందుకు నడవటానికి ఇష్టపడక పోతే ఏమనుకోవాలి? ఎలా అర్థం చేసుకోవాలి? వైషు మీద కోపం మొత్తం జాతి మీదకు మళ్లింది. స్టుపిడ్ ఇండియన్స్ కసిగా తిట్టుకుంది లోపల.

ఇంతలో ఒక చేత్తో కాఫీని, మరో చేత్తో మాయకు ఇష్టమైన హైబిస్కస్ హెర్బల్ టీని తీసుకొని వచ్చి ఎదురుగుండా కూర్చొంది వైషు.

"ఐ యాం సారీ. ఇక్కడంతా మన యూటీ స్టూడెంట్సేగా ఉండేది. ఎవరైనా మనల్ని అలా ఇంటి మేట్‌గా చూస్తే బావుండదనుకున్నాను. అంతే కానీ నిన్ను బాధపెట్టాలని కాదు," మాయ చేతి మీద చెయ్యి వేసింది వైషు, చేసిన తప్పుకు పశ్చాత్తాపం అన్నట్లుగా.

"నీతో వచ్చేటప్పుడు మాస్క్ వేసుకొని రావాలని తెలుసు. కానీ ఒక్కోసారి ఆ విషయం మర్చిపోతుం టాను." మాయ మాటలు సూటిగా చురకత్తుల్లా వున్నాయి. ఆ మాటల్లో వ్యంగ్యం, బాధ, కోపం.

"పబ్లిక్‌లో మనమెలా ఉండాలి అన్న విషయం మొదట్లోనే మాట్లాడుకున్నాం. ఒక ఒప్పందం కూడా చేసుకున్నాము. అదంతా మర్చిపోయావా?" అన్నీ ఒప్పు కొని మళ్లీ తప్పు తనదే అయినట్లు మాయ మాట్లాడటం చూసి వైషుకి కూడా చిరాకొచ్చింది.

"అవును ఒప్పందం చేసుకున్నాము. అంత మాత్రాన మనిద్దరి మధ్య ఉన్నది కేవలం కాంట్రాక్టా? నేనొక మాములు మనిషిని. నీమీద ప్రేమను పెంచుకోవ టమే తప్ప దాచుకోవటం నాకు తెలియటంలేదు. ఇంట్లో ఒకలా, పబ్లిక్‌లో మరోలా ఉండటం నాకు రావట్లేదు. నీతో బయటకు వస్తోంది నేనేనంటావా? నా మొహం మీదున్న మాస్క్ నాకు తెలుస్తోంది. నీకు తెలియటం లేదా? Don't you feel it baby? ఇంట్లో నీతో ఎలా ఉంటాను? ఇక్కడెలా ఉండమంటు న్నావు?" ఒక్కో మాట మాయ గొంతులోంచి వస్తుంటే ఆమె శరీరం మొత్తం ఒక జలదరింపుకు గురైనట్లు వణికిపో తోంది. ఆమె తెల్లటి మొహం మరింత ఎర్రగా కందిపోయింది. కళ్లల్లోంచి నీళ్లు. మనసు బాధ శరీరానిదై పోయింది.

మాయ అంత ఎమోషనల్ అవటం ఎప్పుడూ చూడలేదు వైషు. అదికాదురా అంటూ మాయ చేతుల మీద చెయ్యి వేసి ఏదో చెప్పబోయింది కానీ వైషుని మాట్లాడనివ్వలేదు. ఆ చేతిని విసురుగా తోసేసింది.

"నిన్ను ముద్దు పెట్టుకోవాలనిపిస్తే ఇంటికెళ్లే వరకు ఆగాలి. అది కాంపస్ కాకూడదు. పబ్ కాకూడదు. పక్కన మన ఫ్రెండ్సో, క్లాస్‌మేట్సో ఎవరూ ఉండ కూడదు. క్యాంపస్‌లో మనిద్దరం రూమ్‌మేట్స్‌గా మాత్రమే తెలియాలి. ఇలా ఎక్కడికక్కడ నన్ను నేను కట్ చేసుకుంటూ నీకు తగ్గట్లుగా, నీకనుకూలంగా ఉండాలి. ఇదంతా నాకెంత సఫోకేటింగ్‌గా ఉందో నీకర్థ మవుతోందా? నువ్వెప్పుడైనా నావైపు ఆలోచించావా? నా ఎదురుచూపులు నీకు నా చేతకానితనంగా కనిపిస్తోంది కదూ." లోపలి ఏడుపు మొత్తం ధారధారలుగా కొంచెం కళ్ల నుంచి, కొంచెం గొంతులోంచి బయటకు వస్తోంది. తెల్లటి శరీరం మీద పైకి ఉబికి వచ్చిన నరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వైషుకు ఏంమాట్లాడాలో అర్థంకాలేదు. మాయకు ఎలా సర్దిచెప్పాలో తెలియలేదు. నడిరోడ్డు మీద ఎవరో తనను ముక్కలు ముక్కలుగా నరికేస్తున్న ఫీలింగ్. మాయ విసురుతున్న మాటలు ఒకొక్కటిగా దూసుకొని వచ్చి వైషు మనసుని ఛిద్రం చేసేస్తున్నాయి. మొదట్లో తన సంకోచాలు చెప్పినప్పుడు దగ్గరకు తీసుకొని ఓదార్చిన మాయ, ఇప్పుడు అన్ని తప్పులు తనవే అయినట్లు నిందిస్తుంటే, అవేమీ తనను కాదన్నట్లు, తనకంటూ మాట్లాడటానికి ఇంకేమీ లేదన్నట్లు అలా శిలావిగ్రహం లా నిలబడి ఆ నిందలు మోయటం కష్టమనిపించింది. అసలు తప్పు మాయదే, నన్ను రెచ్చగొట్టి లోబర్చు కుందనిపించింది.

మాయ నిందిస్తుంటే, వైషు మాయను తప్పు పడు తోంది. ఒకరినొకరు మాటలతో బాధ పెట్టుకుంటు న్నారు. కలిసి ప్రేమను పంచుకున్న ఇద్దరూ ఒక అనిర్వ చనీయమైన అనుభూతిని కత్తులతో సమూలంగా రెండు వైపుల నుంచి నరికేసుకుంటున్నారు.

మాయ మాటలకు బాధ, తర్వాత చిరాకు, కోపం, అసహనం అన్నీ ఒకదాని వెంట ఒకటి కలగలిసి వస్తుంటే, "నాకు ఇంకొంచెం టైం కావాలి, మన విషయం ఇంట్లో కానీ, బయట కానీ తెలియటానికని నిన్ను రిక్వెస్ట్ చేశాను. నువ్వు దానికి ఒప్పుకున్నావు. నాకోసం వెయిట్ చేస్తానన్నావు. మళ్లీ ఇప్పుడు నన్ను బ్లేమ్ చేస్తావెందుకు?" ఏడుస్తూ, తనకు తెలియకుండానే పెద్ద గొంతుతో అరిచేసింది.

తన బాధను, ప్రేమను, ఎదురుచూపులను అర్థం చేసుకోకుండా తిరిగి తననే తప్పు పడుతున్న వైషు మీద మాయకు మరింత కోపం వచ్చింది.

"ఇప్పటికి ఏడాదికి పైగా ఇద్దరం కలిసి ఒకే ఇంట్లో, ఒకే మంచం మీద పడుకుంటున్నాము. ఇంకెంత టైం కావాలో చెప్పు. అండర్ గ్రాడ్ అంతా అయ్యాక చెప్దామా? అప్పుడు మాత్రం ఎందుకులే, ఇలాగే గ్రాడ్ స్కూల్ కూడా పూర్తి చేసేద్దాం. ఆ తర్వాత కూడా 'స్ట్రైట్'గా పెళ్లిళ్లు చేసుకొందాము. పిల్లలను కందాము. అప్పుడు తీరికగా కూర్చొని ఆలోచిద్దాము. సరేనా?" మాయ మాటల్లో వ్యంగ్యానికి వైషుకు కోపం కన్నా చిరాకు అనిపించింది. అయినా సరే కంట్రోల్ చేసు కుంటూ, "నువ్వు అనవసరంగా ఎక్కువ ఆలోచిస్తు న్నావు," అంది.

"అవును. నేనెక్కువ కలలు కంటున్నాను. మనం పెళ్లి చేసుకుంటామని, కలిసి పిల్లలను పెంచుతామని ఇలా అనేకరకాలుగా ఊహిస్తున్నాను. నేనే పిచ్చిదానిగా నీ ప్రేమకోసం, నీకు అనువైన టైం కోసం ఎదురు చూస్తు న్నాను. ఒక్కటి చెప్పు, నేను అబ్బాయి అయితే, నువ్వింత ఆలోచించేదానివా? నిన్ను పబ్లిక్‌గా ముద్దు పెట్టుకుంటే తోసేసేదానివా? ఆలోచించి చూడు. నేనేం మాట్లాడుతున్నానో, నేనెందుకు హర్ట్ అవుతున్నానో నీకు తెలుస్తుంది."

మాయ అడిగిన దానికి వైషుకు వెంటనే ఏం చెప్పాలో తెలియలేదు.

"నీకు నాతో రహస్యంగా సెక్స్ కావాలి కానీ నేనక్కరలేదు. నా ప్రేమ అక్కరలేదు. నిన్ను నువ్వు మోసం చేసుకుంటే పర్వాలేదు. కానీ నన్ను కూడా మోసగిస్తున్నావు నువ్వు, నా దగ్గర నటిస్తున్నావు. ఇంట్లో గర్ల్‌ఫ్రెండ్, బయట బాయ్‌ఫ్రెండ్. నీలా నటించటం నాకు చేతకావటం కాదు." లోపలి అగ్నిపర్వతాలు మొత్తం ఒక్కసారి విస్ఫోటనం చెందినట్లు లోలోపలి నుంచి ఎప్పటి నుంచో తనకే తెలియకుండా తన లోపల దాగి ఉన్న అనేక ఆలోచనల్ని, అనుమానాల్ని మొత్తం బయటకు వెళ్లగక్కింది మాయ.

మోసం, నటనలాంటి మాటలు వినేసరికి వైషుకు కోపం తారాస్థాయికి వెళ్లింది. అప్పటివరకూ మాయ ఎన్ని మాటలు అన్నా కొంతైనా సహించగలిగింది కానీ తనను అనుమానించటాన్ని, రాహుల్‌కి, తనకు మధ్య ఏదో ఉందని అనటాన్ని మాత్రం సహించలేకపోయింది. మాయ తనను అనుమానించటం తన జీవితంలో జరిగిన పెద్ద అవమానంగా తోచింది వైష్ణవికి.

"నేను చేస్తోంది నటనా? నాకు బాయ్‌ఫ్రెండా? రాహుల్ గురించా నువ్వు మాట్లాడుతోంది? అతను నా క్లాస్‌మేట్, మంచి ఫ్రెండ్. నాలుగైదుసార్లు బయటకు వెళితే అతను నాకు బాయ్‌ఫ్రెండ్ అయిపోతాడా? నీ స్థాయి ఇదన్న మాట. అయినా అసలు నీకెందుకింత వివరణ ఇవ్వాలి? నాకు ఇష్టమైతే నీతో పడుకుంటాను. లేకపోతే లేదు. నువ్వెవరు నన్ను క్వెశ్చన్ చేయటానికి.

"అసలు నీతో ఇన్ని మాటలు అనవసరం. వుయ్ ఆర్ డన్. ఐయాం ఔట్. ఔట్ ఆఫ్ దిస్ రిలేషన్‌షిప్," బ్రేకప్ ప్రకటించేసింది వైషు. కోపంతో ముక్కుపుటాలు అదురుతున్నాయి. మాటలు, ఏడుపు అన్నీ కలిసి పోయాయి హటాత్తుగా వైషు నోటి నుంచి వచ్చిన ఆ నిర్ణయంలో.

"ఫ... యు... ఐ డోంట్ వాంట్ యు... ఐయాం మూవింగ్ ఔట్." విసవిసా అక్కడనుంచి వెళ్లిపోయింది మాయ.

ఉన్నట్లుండి మారిపోయిన పరిస్థితిని షాక్ తిన్నట్లు అలా చూస్తూ ఉండి పోయింది వైషు. దెబ్బతిన్న పక్షిలా ఆమె మనస్సు గిలగిలా కొట్టుకొంటోంది. అవ మానంతో, బాధతో వైషు మొహం పాలిపోయింది. ఇన్నాళ్లు మాయ తనమీద చూపించిన ప్రేమ అంతా ఒక్కసారిగా దూదిపింజెలా ఎక్కడికో ఎగిరిపోయినట్లని పించింది. కళ్లమ్మట నీళ్లు.

మాయ అన్న మాటలు ఒకొక్కటిగా అప్పుడు మళ్లీ వినిపిస్తున్నాయి, మరింత అర్థం అయ్యేటట్లుగా... తానన్న మాటలు కూడా తనకే మళ్లీ చెవుల్లో ప్రతిధ్వనిస్తు న్నాయి. టేబుల్ మీద కాఫీ, టీ రెండూ ఎవరూ తాక కుండా అలా ఒకదాని పక్కన ఒకటి పెట్టి ఉన్నాయి. కోపంతో వెళ్లిపోయిన మాయ తిరిగి వస్తుందేమో అన్నట్లు మాయ వెళ్లిన వైపే చూస్తోంది వైషు.

ప్రవహించి ప్రవహించి అలసి ఆగిపోయిన నదిలా ఉంది లేక్... దూరం నుంచి వస్తున్న బోట్‌లో అమ్మాయి, అబ్బాయి ముద్దాడుకుంటూ కనిపిస్తున్నారు. కొంచెం దూరంగా ఉన్న మరో టేబుల్ మీద ఎవరో ఇండియన్‌జంట కూర్చొని కాఫీ తాగుతున్నారు. వాళ్లు తమ వంకే చూస్తున్నట్లనిపించి మరోవైపుకు తల తిప్పే సింది. వాళ్లు ఇందాకటి నుంచి ఉన్నారా? ఇప్పుడే వచ్చారా? మాయ, తానూ పోట్లాడుకున్నది వాళ్లు చూసారా? అసలు మాయ అలా ఎలా అనగలుగు తుంది ఇలాంటి మాటలు? తన భయాలు, తన ఫామిలీ బాక్‌గ్రౌండ్ అన్నీ చెప్పింది. కొంచెం టైం కావాలి అని అడిగింది. అన్నింటికి సరే అన్నది. ఇప్పుడు పబ్లిక్‌గా ఇలా సీన్ చేసి తనను వదిలేసి ఎలా వెళ్లిపోగలిగింది? మొదటి నుంచి తామిద్దరి మధ్య జరిగిన విషయాలు, అన్నీ ఒకొక్కటిగా గుర్తుకు వస్తున్నాయి. తుడుచుకున్నకొద్దీ బయటకు వస్తున్నాయి కన్నీళ్లు లోపలి ఆలోచనల్లాగా...

## 4

ఒక శుక్రవారం సాయంత్రం. అప్పుడప్పుడే చీకటి పడుతోంది. శుక్రవారం సాయంత్రాలు ఆ కాంపస్ చుట్టు పక్కలంతా, ముఖ్యంగా ఆ నైబర్ హుడ్ అంతా కోలా హలంగా ఉంటుంది. అదంతా స్టూడెంట్ లోకాలిటీ. పార్టీల హడావిడితో వీధి అంతా కళకళలాడుతోంది. వచ్చేపోయే స్నేహితులు, కార్లు, బైకులు అంతా ఓ ఉత్సాహకరమైన వాతావరణం నిండి ఉంది. వేగంగా వెళ్తున్న కార్లలో నుంచి రకరకాల సంగీతం పెద్దగా వినిపి స్తోంది. ఇల్లంతా ఇండియన్ స్పైసెస్ వాసన గుప్పు మంటోంది. కాంపస్ నుంచి వచ్చిన మాయకు, వైష్ణవి కిచెన్‌లో అప్పటిదాకా ఏవో స్పెషల్స్ చేసిం దని అర్థమై వైష్ణవి కోసం వెతికింది. వైష్ణవి షవర్‌లో ఉన్నట్లు అర్థమై, ఇంటి ముందున్న పెకాన్ చెట్టు కింద వికర్ కుర్చీ వేసు కొని బీర్ తాగుతూ అటూ ఇటూ వచ్చేపోయే వాళ్లను చూస్తూ రిలాక్స్ అవుతోంది.

అటు వెళ్లేవాళ్లు, ఇటు వచ్చేవాళ్లు బయట కూర్చున్న మాయకు హాయ్ చెప్తున్నారు, చేతులూపు తున్నారు. పెద్ద పెద్ద ఉడతలు వచ్చి కింద పడిన పెకాన్ కాయలను తీసుకెళ్తున్నాయి. మాయ చెట్టు కిందనే కూర్చోవటంతో రావాలా, వద్దా అని కాసేపు అవి తట పటాయించి మాయను చూసి మన ఫ్రెండే అనే నమ్మ కంతో గబుక్కున వచ్చి ఒక్కో కాయను తీసుకుపోతు న్నాయి. ఉడతల కిచకిచలకు, అటూ ఇటూ దొంగ చూపులు చూస్తూ కింద రాలిపడిన ఆకుల మీద పరు గెడుతూ చేసే శబ్దానికి మాయ వాటినే గమనించ సాగింది. కాసేపయ్యాక లేచి లోపలకు వెళ్లింది.

వైష్ణవి హాల్లో లేదు. కిచెన్‌లోకి వెళ్లి చూసిన మాయ ఒక్క క్షణం చిత్తురువులా ఉండిపోయింది.

లేతాకుపచ్చ జార్జెట్ చీర కట్టుకొని కిచెన్‌లో అల్యూమినియం ట్రేల్లోకి ఫుడ్‌ని సర్దుతోంది వైష్ణవి. తల స్నానం చేసిన కురులను స్ట్రైటెన్ చేసి పైనొక చిన్న క్లిప్ పెట్టి వదిలేసింది. వెనుక నుంచి చూస్తే లేయర్స్‌తో వున్న ఆ పెద్ద జుట్టు అంచెలంచెలుగా దూకే జలపాతంలాగా ఉంది. ఆ నల్లటి జలపాతం నుంచి వైషు శరీరాన్ని అంటి పెట్టుకున్న డిజైనర్ జాకెట్టుకి పైన, కింద

అర్ధనగ్నపు వీపు కనిపిస్తోంది. ఎడమవైపు నడుము వొంపు, తనమీద ఎవరైనా ఒక్కసారి చెయ్యి వేస్తే బాగుం డన్నట్లు ఎదురుచూస్తోంది. అటూ ఇటూ తిరిగినప్పు డల్లా వైష్ణవి కాలిమువ్వలు సన్నటి శబ్దాన్ని చేస్తున్నాయి. చెవులకు వేలాడే జుంకీలు, వాటికి చెంపస్వరాలూ వైష్ణవి తల తిప్పినప్పుడల్లా అటూ ఇటూ ఊగుతున్నాయి.

"హే, స్టన్నింగ్ బ్యూటీ! ఏంటీ స్పెషల్? ఎంత సెక్సీగా ఉన్నావో తెలుసా ఈ డ్రెస్‌లో?" దగ్గరగా వచ్చి వైష్ణవి చీరకట్టు వంక ఆశ్చర్యంగా చూస్తోంది మాయ.

"దీన్ని చీర అంటారు. ప్రపంచం మొత్తంలో అతి సెక్సియస్ట్ డ్రెస్ ఇదే తెలుసా?" ఆ మాటల్లో ఒక ఇండియన్ ప్రైడ్. ఒక చేతిని పక్కకు వొంచి పమిటను దానిమీద జార్చి ఓ భంగిమలో నిలబడింది. ఆ అందము చీరదో, అలా నిలబడ్డ వైష్ణవిదో తెలియ నంతగా మాయ మనసు అక్కడ చిక్కుకుపోయింది.

క్యాంపస్‌లో చాలామంది ఇండియన్స్ గాగ్రా చోళీలు, అనార్కలీ డ్రెస్‌లు వేసుకోవటం చూసింది కానీ ఈ చీరకట్టుని ఇంత దగ్గరగా ఎప్పుడూ చూసి ఉండక పోవటంతో అదొక అద్భుతంగా చీర పల్లూని చేత్తో ముట్టుకొని చూస్తూ అది శరీరంలో ఎటువైపు మొదలై ఎటువైపుకు వంపులు తిరిగి ఎక్కడకు వచ్చిందో పరీక్షిస్తోంది మాయ. వైష్ణవి చుట్టూ తిరిగింది. మాయ తనకు అంత దగ్గరగా నిలబడి తనను అన్నివైపులా నుంచి అలా ఒక శిల్పాన్ని చూస్తున్నట్లు చూస్తుంటే వైష్ణవికి అదోలా అనిపించింది. మాయ తనని చేత్తో తాకకపోయినా తాకినట్లే అనిపిస్తోంది.

"కమాన్ మాయ," వద్దు అన్నట్లు చేత్తో వారిస్తూ.

"నేను కూడా దీన్ని కట్టుకోవచ్చా? ఎలా కట్టుకో వాలో నేర్పిస్తావా? ప్లీజ్, ప్లీజ్," వైషు గడ్డం పుచ్చుకొని బతిమిలాడటం మొదలుపెట్టింది.

"సరే, సరే, నా దగ్గర ఇంకో చీర ఉంది. అది కడతాను."

ఆ మాట వినగానే గట్టిగా అరుస్తూ ఎగిరి గెంతే సింది మాయ.

"ఇంతకూ ఏంటీ స్పెషల్ ? ఈ చీర, ఈ వంటలు..."

"క్యాంపస్‌లో ఇండియన్ స్టూడెంట్ అసోసి యేషన్ వాళ్లు 'ఉగాది- తెలుగు న్యూ యియర్ ఫెస్టివల్' చేస్తున్నారు. నువ్వు కూడా వస్తావా నాతో? ఇద్దరం ఇలా చీరల్లో వెళ్దాము. నీకు ఎలా మేకప్ చేస్తానో చూడు. నువ్వు ఇండియన్‌వి కాదంటే ఎవరూ నమ్మ లేరు."

మాయ కూడా చీర కట్టుకొని తనతోపాటు వస్తుందని తెలిసేసరికి వైష్ణవికి ఉత్సాహం ఆగటంలేదు. మాయకు ఎలా మేకప్ చేస్తుందో గబగబా చెప్పేస్తోంది. కానీ అవేమీ మాయకు అర్థం కావటంలేదు. మాయ మనసులో వేరే ఘర్షణ. లోపల నుంచి ఒక కాంక్ష మాయను నిలువునా ముంచెత్తుతోంది. ఎదురుగుండా సెక్సీగా నిలబడి, నవ్వుతూ మాట్లాడుతున్న వైషుని చూస్తుంటే మాయకు తనని తాను ఇక ఎలా కంట్రోల్ చేసుకోవాలో తెలియటం లేదు.

పక్కకు తిరిగి కార్నింగ్ వేర్‌లోంచి పసుపు పచ్చ రంగుతో కవ్విస్తూ ఉన్న చిత్రాన్నాన్ని తీసి కొంచెం నోట్లో వేసుకొంది. స్పైసీగా ఉండటంతో మాయకు పాల మారింది.

"సారీ, సారీ నీకు స్పైసీగా ఉందా?" కంగారుగా గ్లాసుతో నీళ్లు తీసుకొని మాయకు దగ్గరగా జరిగి తల మీద చిన్నగా కొడుతూ తాగటానికి నీళ్లిచ్చింది.

"నీకన్నా స్పైసీగా ఏమీ లేదులే," చిలిపిగా నవ్వుతూ, తనకు దగ్గరగా వచ్చిన వైషు నడుంమీద చెయ్యి వేసి తనవైపుకు తిప్పుకుంది మాయ. పెదాల మీద సుతారంగా ముద్దు పెట్టుకొంది, చెట్టు మీద పండును అందుకున్నట్లు వైషు పెదాలను అందుకొంది. అంతా ఒక్కక్షణంలో జరిగిపోయింది. తడితడిగా ఉన్న మాయ పెదాలను మరింత తమకంతో అందుకుంది వైష్ణవి. ఆ మోహపు ముద్దు వాళ్లిద్దరినీ మరింత దగ్గర చేసింది.

ఆ ఇద్దరి మధ్య చీర నిమిత్తమాత్రంగా మిగిలింది.

మాయ ఆర్తిగా ముద్దు పెట్టుకొంటుంటే వైషు మరింత గట్టిగా అల్లుకుపోయింది. కళ్లు మూసుకున్న వైషు మీదకు వొంగి నెమ్మదిగా చెవిలో, "నువ్వు కాసేపు అలాగే కళ్లు మూసుకొని ఉండు. ఆ కనురెప్పలకి రెక్కలు తొడిగి కలల లోకంలో ప్రవేశించు. అక్కడ అనేక సరస్సులు, వాటిల్లో కలువపూలు, తామరపూలు, చుట్టూ బోలెడన్ని పూలమొక్కలు, పూల పుప్పొడిని ముద్దాడుతున్న రంగురంగుల సీతాకోక చిలుకలు. మరో పక్క గున్నమామిడి చెట్టు. ఆ చెట్టు కింద మనిద్దరం ఒక బిగి కౌగిలింతలో. లేత మావిచిగురుని తినిపిస్తుంటే నువ్వు నా వేలికొసను నీ నాలికతో సుతారంగా తాకు తున్నావు. నేను నీ చెవితమ్మెను ముద్దాడుతున్నాను. ఆ లోకంలో ఉన్నది మనిద్దరమే. లేదు, లేదు ఒక్కరమే." మాటల మంత్రజాలపు యవనికను జార్చింది. మరో లోకంలో ఆ దృశ్యాన్ని వైషు అంతఃచక్షువులతో అనుభ

విస్తోంది. మాయ పెదాలు వైషు దేహాన్ని మొత్తం చుట్టి వస్తున్నాయి. మూసుకున్న కనురెప్పలను ముద్దాడింది. వైషు పెదాలు సన్నగా వణుకుతున్నాయి. ఆ వణికే పెదాలను, వాటి చాటున తమకాన్ని అర సెకండ్ విభ్రమగా చూసింది మాయ. మాయ చేతులలో వైషు శిల్ప శరీరం అనేకానేక వొంపులు తిరుగుతోంది.

మాయ ఊపిరి వెచ్చగా తాకుతుంటే నెమ్మదిగా కనురెప్పలు తెరిచి రెండు చేతులతో మాయను దగ్గరకు లాక్కొని, "నీ చేతుల్లో ఏదో మంత్రదండం ఉంది. నీ చూపుల్లో ఇంకేదో శక్తిపాతం. వద్దు వద్దు అనుకుంటూనే నీ దగ్గర పసిపాపనై పోతాను," వైషు మంద్రస్వరపు మత్తుతో మాట్లాడుతుంటే చూపుడువేలితో వైషు పెదాల మీద సుతారంగా రాసింది మాయ.

అలా ఆ రెండు దేహతంత్రులు ఒకదాని నొకటి కొనగోటితో మీటుకున్నాయి. కాంక్షలు అల్లరిగా ఆడు కున్నాయి. కాసేపటికి అలసిపోయి ఆడుతున్న ఆటను ఆపి ఒకరిపక్కన మరొకరు అలా చేతులు పట్టుకొని పడుకుండిపోయారు. పెనవేసుకొన్న రెండు చేతుల స్పర్శతో ఒకరికి ఊరట, సాంత్వన; మరొకరికి ధైర్యం, నిశ్చింత.

**5**

కాఫీషాప్ నుంచి బయటకు వచ్చేసిన మాయ కారు తీసి ఎటు వెళ్లాలో ఏమీ ఆలోచించుకోకుండా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయింది. ఆలోచనల్లోంచి బయట పడి చూస్తే ఎదురుగుండా బుక్ ఉమన్ స్టోర్ బోర్డ్ కనిపిస్తోంది.

లోపలకు వెళ్లగానే, "హాయ్ మాయా! వైషు రాలేదా?" బాగా పరిచయమున్న స్టోర్ మేనేజర్ క్యాతీ అడుగుతుంటే నో అంటూ సంభాషణ పొడిగించకుండా ముందు కెళ్లి బుక్స్ చూడటం మొదలుపెట్టింది.

పుస్తకాలు చూస్తోంది కానీ మనసంతా జరిగిన విషయాల చుట్టే తిరుగుతోంది. ఏ పుస్తకం తెరిచి చూసినా కొంచెం అమాయకంగా, మరికొంత సిగ్గుగా నవ్వే వైషు మొహమే గుర్తుకువస్తోంది. బెడ్‌రూమ్‌లో ఇంకా తన దగ్గర కొంత బెరుకుతనమే చూపించే వైషు గుర్తుకురాగానే మాయ మనసు కరిగిపోయింది.

పాపం పిచ్చిపిల్ల! అనవసరంగా తన మనసు నొప్పించాను. నేనే తొందరపడ్డానేమో. తను ఇంకా రెడీగా లేదని తెలిసి కూడా నేను పుష్ చేశాననుకొని ఒక్కక్షణం బాధపడింది. ఫోన్ చేసి సారీ చెప్పేస్తాను అనుకుంటూ ఫోన్ తీసింది. వైషు నుంచి తప్పనిసరిగా తన కోసం మిస్డ్ కాలో, టెక్స్‌ట్ మెసేజో ఉంటుందని ఊహిస్తూ ఫోన్ బయటకు తీసిన మాయకు అలాంటిదేమీ లేకపోయే సరికి మళ్లీ కోపం వచ్చేసింది. అయినా బ్రేకప్ అంది కదా వైషు. ఇప్పుడు నేను ఫోన్‌చేసి సారీ చెపితే నన్నింకా చులకనగా చూస్తుందనుకుంటూ మళ్లీ ఫోన్ లోపల పెట్టేసింది. కానీ ఆలోచనలు మాత్రం ఆగటం లేదు.

నేను ఊహించిందే కరెక్ట్. ఆ రాహుల్ పరిచయ మయ్యేసరికి నేను నచ్చటం లేదు కాబోలు. అందుకనే బ్రేకప్ చెప్పింది. కనీసం ఫోన్ కూడా చేయలేదనుకునే సరికి మాయ బిగుసుకుపోయింది. చేతిలో ఉన్న పుస్తకాన్ని అక్కడ పడేసి బయటకు వచ్చి నిలబడింది. అసలే కోపం, ఆ పైన ఆకలి. వెంటనే థాయ్ రెస్టారెంట్ లోకి వెళ్లి ఆర్డర్ ఇచ్చి కూర్చొంది.

అసలు వైషు గురించి ఆలోచించకూడదను కుంటూ బలవంతంగా ఆలో చనలు మరల్చే ప్రయత్నం చేసింది కానీ విఫలమవుతోంది మాయ. ఆర్డర్ చేసిన ఫుడ్ టేబుల్ మీదకు వచ్చింది. కోకోనట్ సాస్‌తో చేసిన రెడ్ కర్రీ, రైస్ చూడగానే మళ్లీ వైషునే గుర్తుకు వచ్చింది. వైషు కోసమేగా వెజిటేరియన్ ఫుడ్ అలవాటు చేసుకుం దనుకుంటూ పంతంగా దాన్ని పక్కకు పెట్టేసి మళ్లీ స్టూవర్ట్‌ని పిలిచి మీ దగ్గర బీఫ్ దొరుకుతుందా? అని అడిగింది.

**6**

నెమ్మదిగా చీకటి తెరలు వచ్చి లేక్ ముంగిట వాలుతున్నాయి ఎదురుగుండా ఉన్న కాఫీ చల్లారిపో యింది ఒక్క సిప్ కూడా చేయకుండానే. చుట్టూ ఉన్న టేబుల్స్ నిండిపోయాయి చూస్తూ ఉండగానే. చాలా టేబుల్స్ మీద స్టూడెంట్స్ కూర్చొని వర్క్ చేసుకుంటు న్నారు. జంటలుగా వచ్చినవాళ్లు, పిల్లలు, కుక్కలతో డెక్ అంతా గొడవ గొడవగా ఉంది. కానీ అవేమీ వైష్ణవి మనసుని తాకటంలేదు. వైష్ణవి ఉన్న చోటు నుంచి పక్కకు కూడా కదలలేదు.

మాయా, తానూ ఇద్దరు అలా పబ్లిక్‌లో గొడవ పడటం, ఏడవటం, మాయ తనను అలా వొంటరిగా వదిలేసి వెళ్లిపోవటం అవన్నీ కూడా తలకొట్టేసినట్లు అనిపించింది వైషుకు. అవమానభారంతో తలెత్తి చుట్టూ ఎవరివంకా చూడలేక తల దించుకొని కంప్యూటర్ వంక, పుస్తకాల వంక చూస్తూ ఉండిపోయింది.

ఎదురుగుండా 'డివైన్ కామెడీ' బుక్ కవర్ మీద నుంచి డాంటే సూటిగా తన వంకే చూస్తున్నట్లు అనిపించింది వైషుకి.

"నేనెవరు?"

స్ట్రైట్? లెస్బియన్? బై సెక్సువల్?

మాయని ఇష్టపడటమంటే నేను లెస్బియన్ అని పదిమంది ముందు ఒప్పుకోవాల్సి ఉంటుంది. రాహుల్నో, ఇంకెవరినో కావాలనుకుంటే 'స్ట్రైట్' అనే లేబుల్ వేసుకోవాలి. ఈ విషయం ఇంట్లో తెలిస్తే ఏం జరుగుతుంది? అసలు ఈ విషయం చెప్పటానికి తల ఎత్తి ధైర్యంగా నాన్న ఎదురుగా నిలబడగలనా? అమ్మ కళ్లల్లోకి చూస్తూ ఏం జరిగిందో, తన మనసు, తన శరీరం ఏం కోరుకుంటున్నాయో అర్థమయ్యేలా చెప్పగలనా? అసలు ఈ విషయం తెలిస్తే తమ్ముడేమనుకుంటాడు? ఫ్రెండ్స్ మధ్య తన ఇమేజి ఏమవుతుంది? వీళ్లందరూ నాతో అసలు మాట్లాడతారా? నన్ను వదిలేస్తారా?

సెక్సువాలిటీ అనేది పర్సనల్ బెడ్రూమ్ వ్యవహారంగా ఎందుకు మిగలలేదో?

మనసంతా ఒక్కసారిగా తేనెతుట్టె కదిలినట్లయింది. స్మృత్యంతర ప్రవాహంలో కొట్టుకుపోతోంది వైషు.

మాయతో మొదటి పరిచయం, తొలిసారి మాయ నడుము కింద భాగంలో 'ఇంద్రధనుస్సు' పచ్చబొట్టుని ముద్దు పెట్టుకున్న అనుభూతి, ఇంకా అనేక అందమైన అనుభవపు అనుభూతుల సుగంధం మనసుని తాకింది. మాయతో ఒక్కో అందమైన అనుభవం గుర్తుకు వచ్చినప్పుడల్లా, ఒక విషాదచారిక నిషాదంలా గుండెలో గుచ్చుకుంటోంది. ప్రతిసారీ మాయామోహపు మంత్రజాలం నుండి బయటకు వచ్చాక తనలో వచ్చే అపరాధ భావన గుర్తుకు వచ్చి మరింత గిలగిలలాడిపోయింది.

ఏది ఎక్కడ మొదలై ఎలా ముగిసిందో ఏం అర్థంకావటం లేదు.

కోర్స్‌వర్క్, డాన్స్ ప్రాక్టీస్, పార్ట్‌టైం జాబ్, వీకెండ్ పార్టీలు, హేంగోవర్‌లు- వీటన్నింటి మధ్య ఇది కావాలని కానీ, ఇది వద్దని కానీ అనుకున్నానా? ఏది చేతి కందితే అది తీసుకున్నాను. మాయ కూడా అలాగే ప్రవహించింది ఈ దేహంలోకి. తన వొంటిని తనే తాకి చూసుకుంది. ఈ ఒంటి మీద ప్రతిచోటా మాయ స్పర్శ. మాయకు తెలియని చోటు అంటూ ఈ దేహం మీద ఎక్కడాలేదు. కానీ మాయకు తన మనసు తెలియలేదు. తన భయాలు తెలియలేదు. తన ఘర్షణ అసలు తెలియలేదు అనుకోగానే గుండెలో ముళ్లు గుచ్చుకున్న బాధ.

స్కూల్లో హోమో సెక్సువల్ రిలేషన్‌షిప్‌ల గురించి ఫ్రెండ్స్ మాట్లాడేటప్పుడు వొళ్లు జలదరించేది. అంత అసహజంగా ఎలా ఉంటారో అనిపించేది. కానీ మాయ తనను ముద్దు పెట్టుకున్నపుడు అబ్బాయిలు ముద్దు పెట్టుకున్నప్పుడు ఎలా ఫీల్ అయిందో అలాగే లేదా అంతకంటే ఎక్కువ ఫీల్ అయింది. తనలో ఇలాంటి లెస్బియన్ ఫీలింగ్స్ ఉన్నాయని తనకు కలలో కూడా తెలియలేదు. కానీ మాయతో అనుభవం ఎంత సహజంగా ఉంది, ఎంత ఇష్టంగా అనిపించింది. మనసుకి ఏ తొడుగు లేకుండా ఎంత స్వేచ్ఛగా ఉంది ఆ సమయంలో!

క్యాంపస్ క్లాసులు, పార్ట్ టైం ఉద్యోగంతో అలిసిపోయి ఇంటికొస్తే మాయతో అనుభవం ఒక రిలాక్సింగ్‌గా అనిపించేది. బయట అందరికీ తెలిసేలా గర్ల్ ఫ్రెండ్స్‌లా ఉందామని మాయ ఇలా పట్టుబడుతుందని అసలెప్పుడూ ఆలోచించలేదు.

కంప్యూటర్ స్క్రీన్ మీద పాస్‌వర్డ్‌తో లాక్ చేసిన ప్రైవేట్ ఫోల్డర్ ఓపెన్ చేసి మాయ, తానూ కలిసి తీయించుకున్న ఫోటోలు చూస్తున్నకొద్దీ వైషులో దుఃఖం ఎక్కువవుతోంది.

ఒకపక్క తన సెక్సువాలిటీ ఏమిటి, తనకేం కావాలి, తన మనఃశరీరాలు ఏం కోరుకుంటున్నాయో ఆలోచిస్తోంది. మరోవైపు అసలు ఈ లేబుల్స్ ఎందుకు? ప్రపంచమంతా కొన్ని లక్షలమంది ఇలాంటి రిలేషన్‌షిప్స్‌లో ఉన్నప్పుడు కూడా సమాజం ఇంత వివక్ష ఎందుకు చూపిస్తోందని ఆలోచిస్తోంది.

నా సెక్సువల్ ఫీలింగ్స్ మొత్తం నా వ్యక్తిత్వాన్ని, నా కుటుంబాన్ని శాసిస్తాయా? అదేం న్యాయం? అమ్మా వాళ్లు నన్ను వేలేస్తారా? ఎవరివి ఆ చూపులు? ఇంట్లో వాళ్లవా? స్నేహితులవా? ఎవరు వాళ్లంతా? ఎందుకలా చూస్తున్నారు తన వంక అసహ్యంగా? ప్రశ్నార్థకంగా? మృతదేహాలని మార్చురీలో పెట్టినట్లు నేను కూడా ఈ దేహాగ్నిని ఐస్‌గడ్డల మధ్య చల్లార్చుకోనా?

ఏమన్నది మాయ? ఇది 'స్ట్రైట్ లవ్' అయితే ఇలా ఉండేదానివా అనికదా అడిగింది. నిజమే. మాయ ప్లేస్‌లో రాహుల్లో, ఇంకెవరో ఉంటే ఏం చేసేది? ఆలోచిస్తున్నకొద్దీ ఒకొక్క పొర నెమ్మదిగా తొలగిపోతోంది. మాయకున్నంత తీవ్ర ప్రేమ తనకెందుకు లేదో అర్థంకాలేదు. కానీ మాయ ప్రేమలోని గాఢత మనసుకు తెలిసింది. అందులోని నిజాయితీ అర్థమయింది. ఈ

మొత్తంలో తానెక్కడ నిలబడి ఉందో తెలిసినట్లనిపించింది వైషుకు. తాను రాహుల్‌తో ఫ్రెండ్లీగా ఉంటే మాయ జెలసీ ఫీల్ అయిందని అర్థమయ్యాక గర్వంగా అనిపించింది వైషుకు.

కానీ ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఏం కావాలో తెలిసినట్లే ఉంది. భవిష్యత్తు గురించి తలచుకున్నప్పుడు మాత్రం భయంగా అనిపిస్తోంది.

ఒక్కో ఆలోచన మెదడులోని ఒక్కో పొరను చీల్చుకొని బయటకు వస్తోంది. ఒక్కో చీలికలోంచి రక్తం బయటకు చిమ్ముకొస్తున్న భావన.

తలంతా విపరీతమైన పోట్లు. లక్షలాది సూదులతో పొడుస్తున్న బాధ. గుండెంతా బరువుగా...

చుట్టూ చీకటిగానే ఉంది. కానీ కళ్లకు మాత్రం అది భరించలేని వెల్తురు లాగా అనిపిస్తోంది. కళ్లు ఆ వెలుగుని తట్టుకోలేకపోతున్నాయి. కళ్లు విప్పార్చి చూడలేకపోతోంది. మైగ్రైన్ అటాక్ మొదలవుతోందని అర్థమయింది ఇక ఆ నొప్పి ఎంత ఎక్కువవుతుందో, ఏ భాగం నుంచి ఏ భాగం వైపుకు మరలుతుందో తెలుసు కాబట్టి వెంటనే ఆలస్యం చేయకుండా క్యాబ్‌కి కాల్ చేసింది.

అన్నివైపుల నుంచి ఆలోచనలు, నొప్పి శరీరాన్ని నలిపేస్తున్నాయి. టేబుల్ మీద తల వాల్చుకొని పడుకుండిపోయింది. ఎందుకు ఏడుపొస్తోందో తెలియటం లేదు. కానీ అలా కళ్లు కన్నీళ్లు పెట్టుకోవటం మనసుకి, శరీరానికి తేలికగా ఉంది.

క్షణంలో ఇంటికెళ్లి పోవాలని ఉంది. కానీ క్యాబ్ ఇంకా రావటం లేదు.

మాయ ఇంట్లో ఉండి ఉంటుందా?

*సారంగ అంతర్జాల పత్రిక, 22 అక్టోబర్ 2014*